నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పాత డంపింగ్ యార్డ్ వద్ద పైప్ లైన్ మరమ్మతులు పూర్తయ్యాయని, పెద్ద దర్గా వద్ద పైప్ లైన్ లీక్ అవుతూ ఉండడంతో కార్పొరేషన్ సిబ్బంది పనులు చేస్తూ ఉన్నారని, పూర్తయ్యే వరకూ ఆ ప్రాంత ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరపాలక సంస్థ ఎస్ఇ రత్నాల రాజు కోరారు. గురువారం ఆయన చాంబర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ నీటి సరఫరా లేని ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి అందిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ బోర్ల ద్వారా నీటిని అందిస్తామని తెలిపారు. పాత పైప్ లైన్లు కావడంతో తరచూ లీకేజీ సంభవిస్తుందని చెప్పారు. పెద్ద దర్గా వద్ద నీటి పైప్ లైన్ మరమ్మతులు పూర్తి చేసి వెంటనే నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎఇ ముని గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కదలని హెల్త్ సెంటర్ల నిర్మాణాలు

- మూడేళ్లుగా నత్తనడకన పనులు
- జిల్లాకు 309 భవనాలు మంజూరు
- 118 మాత్రమే పూర్తి
- వివిధ దశల్లో మరికొన్ని భవనాలు

చీమల చెరువుపల్లిలో ఆగిపోయిన హెల్త్ సెంటర్ పనులు

ప్రజాశక్తి-రాయచోటి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకేచోట ఉందుబాటలో ఉండాలనే సంకల్పంతో గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. వాటికి సంబంధించిన నిర్మాణాల ఎక్కువ చోట్ల కదలిక వివిధ దశలలో నిలిచిపోయాయి. జిల్లాలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడం, కొన్నిచోట్ల స్థలాల సేకరణ ఆలస్యం కావడం, కోర్టు, వివిధ కారణాల వల్ల హెల్త్ సెంటర్ల పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వం 309 హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 118 సెంటర్లు మాత్రమే పూర్తయ్యాయి. 10 భవనాలకు కనీసం పునాదులు కూడా తీయలేదు. ఉపాధి హామీ పథకం (కన్వర్జెన్సీ) నిధులతో సొంత భవనాలు నిర్మించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశ్యం. హెల్త్ సెంటర్ నిర్మాణ పనుల బాధ్యతను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి బాధ్యతలు అప్పగించారు. 2020 మేలో ఒక్కో భవనానికి రూ .17.50 లక్షల చొప్పున జిల్లాలో 309 భవనాలకు రూ.54.60 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాతో నిధులు మంజూరు చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. 10 భూ వివాదాలు, కోర్టు, కాంట్రాక్టు ముందుకు రాక పోవడం వంటి వివిధ కారణాలతో పనులు ఇప్పటి వరకు మెదలు పెట్టలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 52 హెల్త్ సెంటర్లు మంజూరు కాగా మట్టి తీసినవి 1, పునాదులు 16, గోడలు 8, స్లాబ్ 1, పూతల 5 పూర్తయినవి 21. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 66 హెల్త్ సెంటర్లు మంజూరు కాగా మొదలు పెట్టినవి 4, మట్టి తీసినవి 3, పునాదుల 12 ,గోడలు 7, స్లాబ్ 9, పూతల 10, పూర్తయి నవి 17. మదనపల్లి నియోజకవర్గంలో 35 హెల్త్ సెంటర్ల మంజూరు కాగా ఇప్పటి వరకు మొదలు పెట్టినవి 1, మట్టి తీసినవి 0, పునాదుల 12, గోడలు 9, పూతలు 7, పూర్తయినవి 4. పీలేరు నియోజకవర్గంలో 56 హెల్త్ సెంటర్ మంజూరు కాగా మొదలు పెట్టినవి 0, మట్టి తీసినవి 0, పునాదులు 3, గోడలు 8, స్లాబుల 3, పూతల 15, పూర్తయినది 27. రాజంపేట నియోజకవర్గంలో 38 హెల్త్ సెంటర్ల మంజూరు కాగా ఇప్పటివరకు మొదలుపెట్టని 4, మట్టి తీసినవి 1, పునాదులు 8, గోడలు 0 ,స్లాబ్లు 4, పూతల 1, పూర్తయినవి 19. రాయచోటి నియోజకవర్గం 62 హెల్త్ సెంటర్ మంజూరు కాగా ఇప్పటి వరకు మొదలు పెట్టనవి 1, మట్టి తీసినవి 3, గోడలు 6 , స్లాబులు 5 , పూతలు 7, ఇప్పటివరకు పూర్తయినవి 30. మిగిలిన వివిధ దశలలో నిలిచిపోయాయి. ఇప్పటి వరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన సెంటర్లు పూర్తి కావాలంటే ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందోనని పలువురు విమర్శిస్తున్నారు. చేసిన పనులకు సకాలంలో బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులను వదిలేస్తున్నారు. హెల్త్ సెంటర్లు వసతి సమస్య కారణంగా పూర్తి సేవలు ప్రజలకు అందించాలని వైద్య సిబ్బంది అంటున్నారు. ప్రజలకు సూచనలు సలహాలు, వైద్యం అందించాలిన్న సరైన ఏర్పాటు లేకపోగా ఇరుకు గదులలో ఇబ్బందిగా ఉందని వైద్య అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ నాటికి హెల్త్ సెంటర్లను వంద శాతం పూర్తి చేయాలని సమీక్షా సమావేశాలు నిర్వహిస్తుంది. జిల్లాలో సకాలంలో హెల్త్ సెంటర్లు కేంద్రాలు పూర్తిస్థాయిలో అవుతాయో లేదో వేచి చూడాలిసందే .

వేగవంతం చేస్తాం

జిల్లాలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం. మండల ఇంజినీర్లతో సమీక్షించి సమా వేశాలు నిర్వ హిస్తున్నాం. ప్రస్తుతం బిల్లుల కూడా సకాలంలో అందతున్నాయి. సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి స్థాయిలో హెల్త్ సెంటర్లును పూర్తి చేయాలినే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

- కె.జె.ఎస్.చంద్రారెడ్డి, పిఆర్ ఎస్ఇ, రాయచోటి.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ నాయకులు

చలో తిరుపతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 7న తిరుపతి కార్పొరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా కదిలి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని విద్యుత్ భవన్ వద్ద వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 45శాతం ఫిట్మెంట్ పిఆర్సి ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని తెలిపారు. జెఎల్ఎం గ్రేడ్ - 2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని కోరారు. ఇతర ప్రధాన సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులను ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్గా మార్చాలని, శ్రీ కారుణ్య నియామకాలలో అడ్డగోలు నిబంధనలు పెట్టకుండా నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి రామలింగారెడ్డి, ఎపి విద్యుత్ స్ట్రగుల్ ట్రేడ్ యూనియన్ నాయకులు శివశంకర్, సురేంద్ర, మదిలేటి, ప్రతాప రెడ్డి, మాధవరెడ్డి, కిరణ్ ,గంగన్న, విరన్న, రియజు, కేశవ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు సీజ్

కడప అర్బన్ : ఎస్పి కె.కె.ఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అధిక శబ్ద కాలుష్యానికి కారణమైన ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు డిఎస్పి షరీఫ్ వెల్లడించారు. గురువారం సీజ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు. శబ్ద కాలుష్యం వెలువరించే సైలెన్సర్ కలిగిన వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిహారం పంపిణీకి చర్యలు : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు భూ పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ఖాన్ ఆర్డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పెండింగ్ భూసేకరణ అంశాలపై సంబంధిత ఆర్డిఒలు, తహశీల్దార్లు, ఎన్హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎన్హెచ్ 716 కడప నుండి రేణిగుంట జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణ పూర్తి చేశామన్నారు. భూసేకరణకు పరిహారం రూ.98 కోట్లు చెల్లింపు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.79 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.18 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్హెచ్ 440 రాయచోటి- వేంపల్లికి సంబంధించి రూ.33 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.25 కోట్లు చెల్లించామన్నారు. ఇంకను రూ.8కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్హెచ్ 71 మదనపల్లి నుండి పీలేరుకు సంబంధించి రూ.121 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ. 108 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.13 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్హెచ్ 42 మదనపల్లి నుండి మొలకలచెరువుకు సంబంధించి భూసేకరణ కొంత పెండింగ్లో ఉందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కూడా రూ.61 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.43.63 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.17.43 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి లెవెల్ క్రాసింగ్ 119లో భూ సేకరణ పూర్తి చేశారని, ఇందులో ఇంకను రూ.69 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. లెవెల్ క్రాసింగ్ 120లో ఇంకను భూసేకరణ చేయాల్సి ఉందని త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని రాయచోటి ఆర్డిఓను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇంకనూ రూ.1.33 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. లెవెల్ క్రాసింగ్ 95కు సంబంధించి సిటిఎం గ్రామంలో భూసేకరణ త్వరితగతిని పూర్తి చేయాలని మదనపల్లి ఆర్డీవోను ఆదేశించారు. జిల్లా మొత్తంగా జాతీయ రహదారుల అంశానికి సంబంధించి పరిహారం చెల్లింపులలో వచ్చే వారంలోగా 80 శాతం ప్రగతిని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. అలాగే ఇంకను పెండింగ్ ఉన్న భూసేకరణను త్వరితగతిని పూర్తి చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. భూసేకరణను ఆర్డీవోలు స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ప్రాజెక్టు వారీగా సాధించిన ప్రగతి, పరిహారం చెల్లింపు, కోర్టు కేసులు, పెండింగ్ ఫైల్స్ తదితర అంశాలను సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు.

మాట్లాడుతున్న విసి చింతా సుధాకర్

ఉద్యోగికి కంప్యూటర్ నైపుణ్యత తప్పనిసరి

ప్రజాశక్తి - కడప అర్బన్

విశ్వవిద్యాలయంలో పనిచేసే బోధనేతర సిబ్బందిలో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ నైపుణ్యతను కల్గి ఉండాలని విసి చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం వైవీయూ బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీలో 'కంప్యూటర్ ప్రొఫిషియన్సీ స్కిల్' పై నెల రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కం ప్యూటర్ నైపుణ్యత లేకపోతే విధులు బాధ్య తలు వేగంగా నిర్వర్తించలేమని చెప్పారు. ఆధునిక సమాజానికి అనుగుణంగా కంప్యూ టర్ జ్ఞానమే కాదు నైపుణ్యతను కూడా పొందాలన్నారు. సందేహాలుంటే శిక్షకులను అడిగి తెలుసుకోవాలన్నారు. విశ్వవి ద్యాల యంలో కాగితరహిత పాలన కొనసా గుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ నేర్చుకుని తీరాల్సిందేనని స్పష్టం చేశారు. రిజి స్ట్రార్ ఆచార్య వెంకట సుబ్బయ్య మాట్లా డుతూ సిస్టం ఆపరేటింగ్, హార్డ్వేర్ గురించి తెలుసుకుని కంప్యూటర్ వాడే విధానాన్ని ఈ ప్రోగ్రాం ద్వారా నేర్చుకోవాలని తెలిపారు. ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య, స్కిల్ డెవలప్మెంట్ కన్వీనర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ కె.హను మంతు నాయక్, పి. క్రిష్ణయ్య, గ్రంథాలయ, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎం కళాశాలలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

విశ్వ కార్తిక్, ఆయేషి పటేల్ జంటగా నటించనున్న 'కలియుగం' సినిమా షూటింగ్ కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నాని మూవీ వర్క్స్ ఆధ్వర్యంలో గురువారం షూటింగ్ ప్రారంభించారు. ఈ చిత్ర నిర్మాత కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్రెడ్డి (నాని), చిత్ర దర్శకులు రమాకాంత్ రెడ్డి, కళాశాల ఆవరణలో షాట్లను, సన్నివేశాలను రూపొందించారు. అనంతరం ఒక పాటకు సంగీత సాహిత్యాన్ని రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా చిత్త దర్శకులు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ కథా సారాంశం కలియుగంలో తల్లి ప్రేమ లేని మానవుని జీవితం దుర్భరమని సినిమా ముఖ్య సారాంశం అని తెలిపారు. అనంతరం చిత్ర నిర్మాత, ఎండి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా సమాజానికి మంచి సందేశం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్ర డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ చరణ్ మాధవనేని, ఎడిటర్, సంగీత దర్శకులు అజయ్, అరణ సాద, సాహిత్యం చంద్రబోస్, భాస్కర పట్ల, స్టంట్ ప్రేమ్ సన్గారు, ఆర్ట్ రవిబాబు, కొరియోగ్రాఫర్ మోయిన్ పాస్టర్, కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ కందుల రాజేశ్వరమ్మ , ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలు చేస్తున్న చిత్ర యూనిట్

నిజాయితీ అధికారికి బాసటగా నిలుద్దాం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏడాదిగా తనదైన శైలిలో నగర అభివృద్ధికి కృషి చేస్తున్న నగరపాలక కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ నిజాయితీగల అధికారికి బాసటగా నిలుద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, జిల్లా కోశాధికారి బి.లక్ష్మీదేవి విజ్ఞప్తి చేశారు. గురువారం పాత బస్టాండ్లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం జలమయం, మురికిమయం, అవినీతిమయం నుంచి విముక్తికి నగరపాలక సంస్థ కమిషనర్ కృషి చేస్తున్నారని తెలిపారు. నగరంలో విస్తృతంగా పర్యటించి సమస్యలను వెంటనే పరిష్కారానికి చొరవ చూపారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాబట్టడంలో నగరంలో ఉన్న కొంతమంది నుంచి బకాయిలు వసూలు చేయడంలో ఎంతో కృషి చేశారన్నారు. కార్మికులకు, కాంట్రాక్టర్లకు సకాలంలో నిధులు అందించడంలో కమిషనర్ చొరవ అభినందనీయమన్నారు. అనేక సంవత్సరాలుగా ట్రాఫిక్ సమస్యతో సతమవుతున్న ప్రజలకు ఉపశమనంగా నగర రహదారులు వెడల్పు, వరద కాలు వల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇలాంటి అధికారికి కార్మికులు, ప్రజలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డ మృతి

- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

మృతిచెందిన ఎస్తేరు రాణి

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తల్లీబిడ్డ మృతిచెందారు. ఆగ్రహానికి గురైన మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు వివరాల మేరకు.. ఖాజీపేట మండలం రావులపల్లికి చెందిన ఎస్తేరు రాణి (25)కి గత ఏడాది కర్నూలు జిల్లా గడివేముల మండలం మంచాలగుట్ల వాసి చిన్ననాగన్న (జోసెఫ్)తో వివాహమైంది. మంగళవారం రాత్రి ప్రసవ నొప్పులతో బాధపడుతూ ఎస్తేరు రాణఙ మైదుకూరు పిహెచ్సిలో చేరారు. అక్కడ వైద్యురాలు శ్రీలలిత పరీక్షలు నిర్వహించి ప్రసవానికి ఇంకా సమయం ఉందని, ఆస్పత్రిలో ఉండాలని సూచించారు. బుధవారం మధ్యాహ్నం మళ్లీ పరీక్షించారు. అదే రోజు సాయంత్రం నొప్పులు అధికమవ్వడంతో అత్యవసరంగా ఆమెకు ఆపరేషన్ చేశారు. అప్పటికే బిడ్డ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసమయంలో రక్తస్రావం కావడంతో తల్లి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారు. అంబులెన్స్లో ఆమెను కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తల్లీబిడ్డ మృతిచెందారని ఆమె బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దుబాటు చేయడంతో వారు శాంతించారు. మృతురాలి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించారు. తొచూలు కాన్పులో తల్లీబిడ్డ మృతిచెందడంతో ఎస్తేరు రాణి కుటుంబం శోకసంద్రంలో మునిగింది. కాగా తల్లీబిడ్డ మృతి పట్ల మైదుకూరు డిఎస్పి వంశీధర్గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు.

జగనన్న సురక్ష విజయవంతం

- ఉప ముఖ్యమంత్రి ఎస్బి.అంజాద్ బాషా

ప్రజాశక్తి కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అందరి సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 15 వేల 4 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి కూడా నాలుగేళ్ల కాలంలో అన్ని సంక్షేమ కార్యక్రమాలు పెండింగ్ లేకుండా ప్రతి గడపకు చేరిందని తెలిపారు. కులాలకు, మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అన్ని స్థాయిల్లో 99 శాతం శాతం పూర్తి చేశామని చెప్పారు. కడప నియోజకవర్గ పరిధిలో 90 వేల మందికి గాను 83 వేల 706 గృహాలను సర్వే నిర్వహించామని చెప్పారు. 101 గ్రామసభలు కడప నగరంలో నిర్వహించామని తెలిపారు. గ్రామ సభలలో 71 వేల 657 సర్టిఫికెట్లు ప్రజలకు అందజేశామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

రామ్మోహన్ను వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అక్రమ నియామకం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి బామర్ది ఇసి సురేంద్రనాథ్రెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా యుజిసి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా విసి చింతా సుధాకర్, పాలకమండలి సభ్యులు కలిసి నియమించడం తగదని విద్యార్థి, యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈవిషయంపై అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు స్పందించాలని కోరుతూ టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డికి, సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్రకు, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్రెడ్డికి, బిఎస్పి జిల్లా ఇన్ఛార్జి గుర్రప్ప, కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై. విష్ణుప్రీతంరెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ నియామకానికి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.జియావుద్దీన్, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటరీ ఉపాధ్యక్షులు పి.భరత్ కుమార్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎస్.షాకీర్ హుస్సేన్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు బి.సురేష్ నాయక్,పిఎస్యు జిల్లా కన్వీనర్ సి.పి.నాగేంద్ర, నిరుద్యోగ, విద్యార్థి, యువజన సంఘం నాయకులు శ్రీనాథ్, గణేష్, గౌస్ పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని బోడెద్దులపల్లె ఉర్దూ స్కూల్ పాఠశాలలో ఇటీవల స్కూల్ గేట్ మీద పడి విద్యార్థి చనిపోయిన సంఘటనలో ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి గురువారం ఆయన తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాడు-నేడు స్కూల్ అభివృద్ధి పనుల విషయంలో విధులు సక్రమ నిర్వహించ లేదని ఉర్దూ పాఠశాల టీచర్ నజీర్, సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఇంజనీర్ గుప్తా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంద్రకళను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని ఆయన పేర్కొన్నారు.

మాట్లాడుతున్నఎంపిపి చీర్ల సురేష్యాదవ్

నేడు మెగా జాబ్ మేళా : ఎంపిపి

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి చీర్ల సురేష్యాదవ్ తెలిపారు, గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కమలాపురంలోని సిఎస్ఎస్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఈనెల 4న స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వివిధ కంపెనీలు వచ్చే కార్యక్రమానికి పదవ తరగతి, ఇంటర్ ,ఐటిఐ, ఏదైనా డిగ్రీ, డిప్లమో, బీటెక్ చదివిన నిరుద్యోగ యువత సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో పాటు పాస్పోర్టు సైజ్ ఫొటోలు తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్(చిన్న), సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపిటిసిలు రఘురామిరెడ్డి, నాగిరెడ్డి, సాదక్ అలీ, మండల కో - ఆప్షన్ మెంబర్ వారిష్, చంద్ర పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై స్పందించాలి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

దేశంలో దళిత, గిరిజనులపైనా అధిక దాడులు, అత్యాచారాలు, మారణ హోమాలు చోటు చేసుకుంటున్నాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని అంబెద్కర్, పూలే రాజ్యాధికార సాధన సమితి, సామాజిక సంఘాల అధ్యక్షులు ఇండ్ల రామసుబ్బయ్య అన్నారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని గిరిజనులను నగ్నంగా ఊరేగింపు చేసి ఆనందపడటం వారికే చెల్లిందని, ఈ విషయాన్ని రాష్ట్రస్థాయిలో దళిత బహుజన సంఘాలన్నీ తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, బద్వేలు మీడియా ప్రతినిధి పుల్లయ్య, పోరుమామిళ్ల మండలం పార్స్ అధ్యక్షులు ప్రకాశం, ముస్లిం నాయకులు బాష, గిరిజన నాయకులు కొండయ్య పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ కె.నాగరాజు సూచించారు. మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల పని తీరును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి సూచనలిచ్చారు. గ్రామాల్లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు లార్వా సర్వే, జ్వరాల సర్వే చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ నెల 7 నుండి మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం మొదలవుతుందన్నారు. నాగసానిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఐరన్ మాత్రలు మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులకు ఇస్తున్నారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రామ్ అధికారి లక్ష్మీకర్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మరియకుమారి, ఆరోగ్యవిస్తరణ అధికారి కెఎస్ వి ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలం ఆరోగ్యం విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎల్‌డి కంప్యూటర్ ఉదయ్‌కుమార్, సిహెచ్ఒ సునీలా, సచివాలయం సెక్రటరీ పుల్లయ్య యాదవ్, ఎఎన్ఎం రాధ, ఆశా కార్యకర్తలు సువార్తమ్మ, సచివాలయం సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మణిపూర్‌లో జరుగుతున్న దురాగతాలు ఆపాలని, అక్కడ శాంతిని నెలకొల్పాలని కోరుతూ జమ్మలమడుగులో గురువారం సర్వమత శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అఘా యిత్యాలు ఆపాలని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహం నుండి పాతబస్టాండ్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద మత పెద్దలు, ప్రజా సంఘాల, దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. వక్తలు పాస్టర్ సంతోష్, మైనారిటీ నాయకులు మగ్బూల్ బాషా, సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, అడ్వకేట్ సుబ్బారావు, సమతా దళిత యునైటెడ్ నాయకులు సైమన్, సమసమాజ సమితి వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివ కుమార్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నరసింహులు, బుడగజంగం నాయకులు నల్లప్పా, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో సర్వమత నాయకులు, విద్యార్థులు

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హౌసింగ్ కాలనీల నిర్మాణ పనులు అన్ని మండలాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక పాడా కార్యాలయంలోని సమావేశ హాలులో గురువారం ఆయన ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలు పూర్తి చేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులు ప్రారంభించని కాలనీల్లో లబ్ధిదారులతో మాట్లాడి ప్లాట్లు కేటాయించి పనులు మొదలెట్టాలన్నారు. సమావేశంలో పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశులు, పాడా ఎఒ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డిఇ రమణారెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎఇలు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఒఎస్‌డి

ప్రతి ఇంటికీ 'సురక్ష' క్యాలెండర్ చేరాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని ప్రతి ఇంటికి జగనన్న సురక్ష క్యాలెండర్ చేరవేయాలని ఎంపిపి లక్షుమయ్య సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో 15 సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు జగనన్న సురక్ష ప్రభుత్వ పథక మంజూరు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తాన్నారు. ప్రస్తుతం వాలంటీర్లు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి క్యాలెండర్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఎఒ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్

రుణాలతో జీవనోపాధిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది జీవనోపాధులను పెంపొందించుకోవాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్ సూచించారు. స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో గురువారం వైయస్సార్ క్రాంతి పథంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేయూత మహిళా మార్ట్ గురించి గ్రామాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి మార్ట్ సేల్స్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో మైదుకూరు ఏరియా కో-ఆర్డినేటట్ హరప్రసాద్ రాజు, ఎంపిఎ వెంకటరమణ రాజు, సిసిలు, అనిమేటర్స్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నిడుజివ్వి సచివాలయ పరిధిలోని కదిరివారిపల్లె గ్రామంలో గురువారం ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లు తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి, సర్పంచ్ జయప్రద, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో పందుల స్వైర విహారం

పట్టని అధికారులు - రోగాల వ్యాప్తితో ప్రజల్లో భయాందోళనలు

గుడి ప్రాంగణంలో సంచరిస్తున్న పందులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పగలు రాత్రి తేడా లేకుండా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ కారణంగా పట్టణంలో అపరిశుభ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. పందులు ఎక్కడపడితే అక్కడ గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. స్థానిక ఇందిరమ్మ కాలనీ, క్రాంతి నగర్, నారాయణ నగర్ ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వస్తూ అపరిశుభ్రం కలిగించేలా సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నెలలుగా పందుల గోల మరీ పెరిగిపోయిందని, ఇల్లు, గుడిబడి అనే తేడా లేకుండా ప్రవేశిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో పందుల సమస్య నానాటికి జటిలమవుతోంది. దాదాపు దశాబ్దాల నుండి పట్టణంలో పందుల పెంపకం దారులు వాటిని పెంచుకుంటున్నారు. పట్టణం పెరిగిపోవడంతో పందులను పట్టణానికి దూరంగా పెంచుకోవాలని, జనావాసాల్లోకి వదల కూడదని యజమానులకు అధికారులు పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోవడంలేదు. నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పందులను చంపకుండా కేవలం బర్త్ కంట్రోల్ చేసి, పట్టణానికి దూరంగా తరలించాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పందులు గుంపులుగా తిరుగుతూ పలు రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. పందులు అపరిశుభ్ర వాతావరణం ఏర్పరచడంతో ఈగలు, దోమలు, బ్యాక్టీరియా ఎక్కువై అంటువ్యాధులు, విష జ్వరాలు బారినపడే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. పందుల ద్వారా మనుషులకు మెదడు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిసినా కూడా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ఏంటని అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పందుల వల్ల నానా అవస్థలు పడుతున్నామంటూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. జనావాసాల్లో పందుల సంచారాన్ని నివారించి, పరిశుభ్రతకు పెద్దపీట వేసేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందంటూ పలువురు పేర్కొంటున్నారు. పందుల పెంపకం దారులతో మున్సిపల్ అధికారులు చర్చించి పట్టణ శివారు ప్రాంతాల్లో పందులను పెంచుకునేలా, పట్టణంలో సంచరించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్లల్లోకి వస్తున్నాయి..

మా కాలనీలోని ఇళ్లలోకి పందులు వచ్చి అపరిశుభ్రత వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయి. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పందుల కారణంగా కాలనీవాసులు ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు ప్రమాదాలకు గురవతుతున్నారు. పందుల వల్ల కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు.

- గోపాల్, ఇందిరమ్మ కాలనీ, ఎర్రగుంట్ల

ప్రజలు రోగాల పాలవుతున్నారు..

క్రాంతినగర్, నారాయణనగర్ ప్రజలు పందుల బెడదతో అల్లాడుతున్నారు. మెదడువాపు, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు చెప్పినా ఇదిగో తరలిస్తాం అదిగో తరలిస్తాం అంటున్నారే తప్ప పట్టించుకోవడంలేదు. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఏమి చెప్పాలో అధికారులే చెప్పాలి.

- నాగిరెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్, ఎర్రగుంట్ల

రాయలసీమ నీటి కష్టాలు తీర్చింది వైఎస్ఆర్

మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రాయలసీమ ప్రాంత ప్రజల నీటి కష్టాలు తీర్చింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పులివెందులలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన అనంతరం గురువారం ఆయన స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడుతూ తమ హయాంలో పులివెందులను ఏనాడైనా అభివృద్ధి చేసేందుకు చూశావా అని చంద్రబాబును ప్రశ్నించారు. సీఎం జగన్ పులివెందుల నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటూ అభివృద్ధి చేస్తున్నారన్నారు. కుప్పంను కూడా రెవెన్యూ డివిజన్‌గా చేశారన్నారు. గండికోట ప్రాజెక్టును మూడు టిఎంసి నుంచి 27 టిఎంసికి తీసుకు వెళ్లిన ఘనత కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌దేనని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ప్రాజెక్టుల పర్యటన పేరుతో పులివెందుల ప్రాంతానికి వచ్చి అన్ని అబద్ధాలే చెప్పారన్నారు. పోతిరెడ్డిపాడును 11వేల క్యూసెక్కుల నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచిన ఘనత కేవలం వైఎస్‌దేనని ఎంపీ తెలిపారు. వివేకానందరెడ్డి కేసులో తనతోపాటు తన కుటుంబాన్ని, పార్టీని ఇరికించి అప్రతిష్టపాలు చేయాలని బిజెపిలో ఉన్న టిడిపి నాయకులు కొందరు, చంద్రబాబు, తన సోదరి సునీతమ్మ చూస్తున్నారని ఆరోపించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కూడా 3 టిఎంసి నుంచి 10 టిఎంసి నీరు నిలువ ఉంచేందుకు జగన్మోహన్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌ను నిర్వీర్యం చేసింది చంద్రబాబే అని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వైయస్ మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్, చిన్నప్ప, గంగాధర్‌రెడ్డి, చంద్రమౌళి, సర్వోత్తమ్‌రెడ్డి హాఫీజ్, ఓతురు రసూల్ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఒక వైరస్ లాంటివాడని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప తెలిపారు. బుధవారం చంద్రబాబు పర్యటించిన ప్రాంతాలను గురువారం పసుపు నీటితో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు పులివెందుల ప్రాంతంలో పర్యటించి అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేసి పులివెందుల ప్రాంతాన్ని భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, కోడి రమణ, రాజశేఖర్, నాయకులు సోపాల వీర, సూరి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు. **చాపాడు :** చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం అన్ని ప్రాజెక్టుల అభివృద్ధికి వైఎస్ జగన్ కృషి చేశారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలుగుగంగను నీటితో నింపేందుకు వెలుగోడు నుంచి 18 కిలోమీటర్ల వరకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు విన్నవించినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. వైసిపి అధికారంలోకి రాగానే 0 నుండి 18 కిలోమీటర్ల మేర రూ.500 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. తద్వారా 5వేల క్యూసెక్కుల నీరు ప్రవహించేలా అవకాశం కలిగిందన్నారు. పులివెందులకు సమానంగా కుప్పం అభివృద్ధి చేశామని, చంద్రబాబు కుప్పంలోనే అభివృద్ధి చేసుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి జనాలను తరలించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మమయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, గృహసారథి మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగునీరు విడుదలకు చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువకు సాగునీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిపి లక్ష్మమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యం కావడంతో కేసి కాలువకు నీటి విడుదలలో ఆలస్యం అవుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతోందని, వీలైనంత త్వరగా నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌బికెల్లో అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు సకాలంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు నిధులు సరిపోలేదని ఫిర్యాదులు అందడంతో సచివాలయానికి రూ.3.60 లక్షలు, ఆర్‌బికెకు రూ.2.14 లక్షలు, హెల్త్ క్లినిక్‌కు రూ.3.30 లక్షలు అదనంగా చెల్లించనున్నట్లు వివరించారు. మండలంలో 3600 మంది రైతులకు సంబంధించి 2700 ఎకరాలు చుక్కల భూములకు ప్రభుత్వం విముక్తి కలిగించిందన్నారు. రైతులు రెవిన్యూ సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్ పొందాలన్నారు. ఎంపిపి లక్ష్మమయ్య మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుభాని మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి శుభకరణమ్మ, ఎఒ రామానుజన్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఎఒ మ్యాగీ, పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ఖాజీపేట : ప్రజల సమస్యలను పరిష్కరించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని ఖాజీపేట-2 సచివాలయ పరిధిలోని సిద్ధాంతపురం, చెర్లోపల్లి, బుడ్డాయిపల్లి గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే తనయుడు నాగిరెడ్డి, ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచు రాణెమ్మ, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుందూ నది ఆధునికీకరణ పనులు

పూర్తయితే వరదల నుంచి రైతులకు విముక్తి

ప్రజాశక్తి - చాపాడు

ఏటా అధిక వర్షాలు, వరదలు పోటెత్తే సమయంలో కుందూ నది తీర పంట పొలాలు, గ్రామాలు వరదలో చిక్కుకుని తీవ్రనష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం రైతుల, ప్రజల పరిస్థితి అర్థం చేసుకొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. కర్నూలు జిల్లా జూపాడు బంగ్లా నుంచి కడప జిల్లాలోని వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వరకు కుందూ నది వెడల్పు చేసేందుకు గతేడాది 183 కి.మీ. మేరకు రూ.1,350 కోట్లతో పనులు ప్రారంభించారు. 35 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి వీలుగా కుందూ నదిని విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా సివిల్ వర్క్స్‌కు రూ.1,266 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఎక్కువ భాగం మట్టి పనులు, ఆయా గ్రామాలకు హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల్లో సుమారు రూ.2వందల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా చాలా చోట్ల పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. కుందూ నది వెంట పలువురు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, నది ఒడ్డున ఉన్న రైతులు వందల ఎకరాల నది పరంబోకు భూములను ఆక్రమించుకున్నారు. కొందరైతే రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పట్టాలు చేసుకుంటే.. మరికొందరు ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు చేసుకున్నారు. 35 వేల క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా నది విస్తరిస్తే ఆక్రమణదారులు, కబ్జా భూములను కోల్పోతారు. కొంత మంది పట్టా భూముల రైతులు పొలాలను వదులుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఎకరా రూ.10నుంచి రూ.15 లక్షలకుపైగా పలుకుతుండడంతో నష్టపరిహారం అందివ్వాలని అధికారులను కోరుతున్నారు. ఇప్పటికే చాలా ప్రదేశాల్లో ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. కంపచెట్ల తొలగింపు, పూడికతీత, మట్టి గడ్డలు తొలగించే పనులు చేస్తున్నారు. 220మీటర్ల వెడల్పుతో పనులు చేపడుతున్నారు. అయితే ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో సుమారు రూ.2వందల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చాలా చోట్ల పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. తొలగించిన మట్టి, ఇసుకను నదికి ఇరువైపులా కట్టకు పోస్తూ డంప్ చేస్తున్నారు. రైతుల అభ్యర్థన మేరకు పంట పొలాల అవసరాల నిమిత్తం తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు. కుందూనదికి నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం నదికి ఎడమవైపు పనులు చేపడుతున్నారు. ఒక్క చాపాడు మండలం అల్లాడుపల్లె పరిధిలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

అల్లాడుపల్లె వద్ద డంప్ చేస్తున్న తవ్విన ఇసుక

భూమిపూజ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, అధికారులు

ఆర్‌టిసి బస్టాండ్ రూపురేఖలు మారుస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఆర్‌టిసి బస్టాండు రూపురేఖలను మార్చనున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ పునర్నిర్మాణం కోసం ఎంపీ, ఆర్‌టిసి చైర్మన్ దుగ్గాయపల్లి మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆర్‌టిసికి చెందిన రూ.302 లక్షల నిధులతో బస్టాండును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌టిసి జోనల్ ఇడి వెంకటేశ్వరరావు, ఆర్ఎం గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్‌వలి, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ గోగుల కొండయ్య, ఎంపిటిసిలు భారతి, రాజ్‌కుమార్, కటిక చంద్రశేఖర్, రహంతుల్లాఖాన్, వైసిపి మండల యూత్ కన్వీనర్ రవిశంకర్‌గౌడ్, మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి, పులివెందుల డిఎం రామకృష్ణ, ఆర్‌టిసి ఇఇ శ్రీనివాస్, ప్రొద్దుటూరు డిఎం ఎఎం రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మటన్ బాబా పాల్గొన్నారు.

చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న సర్పంచు శివచంద్రారెడ్డి

నూతన ప్రభుత్వ సముదాయాల పరిశీలన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కానపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం పనులను గురువారం ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ సిఇ కృష్ణారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలిచ్చారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ ప్రాంగణానికి యాభై సెంట్ల స్థలం ఇచ్చిన కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి దాతృత్వాన్ని సిఇ అభినందించారు. కొత్తపల్లె ఒకటవ సచివాలయాన్ని కూడా సందర్శించి, అక్కడ విజిటర్స్ డైరీ పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, యువ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సిఇ కృష్ణారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డిఇ హరనాథ్, ఇఇ నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇఇ శ్యాంసుందర్ రాజు, ఎఇలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుండా రామయ్య విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బిసి నాయకులు, చేనేతలు

బిసిల ద్రోహి చంద్రబాబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

బిసిల ద్రోహి చంద్రబాబు అని హస్తకళల చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి పేర్కొన్నారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో గురువారం మాజీ శాసనసభ్యులు కుండా రామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, చేనేత కళాకారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు జమ్మలమడుగులో నిర్వహించిన రోడ్ షోలో జమ్మలమడుగు తొలి శాసనసభ్యులు బలహీన వర్గాల చేనేత నాయకులు కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేయకుండా యావత్ చేనేతలను, బిసిలను అవమానపరిచారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని చంద్రబాబు పగటి కలలు కంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో చంద్రబాబుకు, స్థానిక టిడిపి నాయకులకు బిసిలు, చేనేతలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబు.. తాను అధికారంలో ఉండగా ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ఇప్పుడు నీళ్లు, ప్రాజెక్టులు అంటూ రోడ్డెక్కిన ఆయనను చూసి రైతులు నవ్వుకుంటున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి చంద్రబాబే అడ్డంకి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది

ప్రజాశక్తి - చాపాడు

ప్రజల్లో వైసిపికి వ్యతిరేకంగా మార్పు కనిపిస్తోందని టిడిపి మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. చాపాడు గ్రామంలో గురువారం ఆయన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ కర్నూలు నుంచి శ్రీకాకుళం వరకు టిడిపి నాయకులు చంద్రబాబు నిర్వహించిన యుద్ధభేరికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. పులివెందులలో స్వచ్ఛందంగా ప్రజలు చంద్రబాబు సమావేశానికి హాజరయ్యారన్నారు. సొంత బాబాయిని చంపిన దుర్మార్గులని జగన్ కుటుంబాన్ని పులివెందుల ప్రజలు బహిరంగంగానే పేర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తనపై చేసిన ఆరోపణలకు రుజువులు చూపనందున ప్రొద్దుటూరు కోర్టులో పరువు నష్టం కేసు వేస్తున్నానని పుట్టా తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని అవినీతికి పాల్పడడం తనకు తెలియదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు, టిడిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి, అక్బర్‌వల్లి, నారాయణరెడ్డి, రామాంజనేయులు, రామ్మోహన్, రజిని, లోకేష్, సలీం, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

'మూల' కృషి జిల్లాకే గర్వకారణం

- ఎంపీని కలిసిన మూల మల్లికార్జునరెడ్డి, తవ్వా వెంకటయ్య

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మూల మల్లికార్జునరెడ్డి చేసిన సాహిత్య కృషి కడప జిల్లాకే గర్వకారణమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభినందించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో గురువారం ఎంపీని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యతో కలిసి మూల మల్లికార్జునరెడ్డి తన పుస్తకాలను అందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మూల మల్లికార్జునరెడ్డి సాహితీ కృషి వల్ల రాయలసీమ నాటక వికాసం, చరిత్ర గురించి బాహ్య ప్రపంచానికి తెలిసిందన్నారు. అధిక పనుల వల్ల పుస్తకావిష్కరణ సభకు రాలేకపోయానని తెలిపారు. అయినప్పటికీ ఆయన సాహితీ కృషిని పుస్తకం ద్వారా తెలుసుకొని ఎంతో సంతోషించానన్నారు. వైవియు లలిత కళల విభాగం అభివృద్ధికి చేసిన కృషి, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి చేసిన సేవను కొనియాడారు.